


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి

# ధన్యవాదాలు సార్..

**సీఎంను కలిసినరాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్**

కొడంగల్, జూలై 12 : సీఎం రేవంత్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించి కార్పొరేషన్ స్థానాన్ని కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయనతోపాటు మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

## విదేశీ విద్యాపథకం ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

**రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి**

షాబాద్, జూలై 12: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద మైనారిటీ విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం ఉపకార వేతనాన్ని పొందేందుకు స్ప్రింగ్ సీజన్-2024కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కే నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకొనే విద్యార్థులు ఎంపిక చేయబడిన విదేశాల్లోని యూనివర్సిటీల్లో 1 జనవరి 2024 నుంచి 31 జూలై 2024 వరకు ప్రవేశం పొంది ఉండాలన్నారు. అర్హత గల వారు 8 జూలై నుంచి 7ఆగస్టు 2024 వరకు <<www.telanganaepass.cgg.gov.in>> వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పథకం వివరాలు, అర్హత, దరఖాస్తు చేసుకొనే దేశాలు, విద్యార్హతలు మొదలైన వివరాలు, ఎంపిక విధానంపై వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.

## కాంగ్రెస్ పాలనలో..
# అందరికీ కష్టాలే..

- క్షీణిస్తున్న శాంతి భద్రతలు, కుప్పకూలిన రియల్ ఎస్టేట్
- గడియగడియకు పవర్ కట్, ఇబ్బందులు పడుతున్న రైతులు
- తాండూరులో రాజ్యమేలుతున్న దళారుల దందా
- అక్రమాల జోరు.. అభివృద్ధి శూన్యం
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, జూలై 12 : కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలందరికీ కష్టాలు తప్పడం లేదని తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతి భద్రతలపై కంట్రోల్ ఎక్కడని నిలదీశారు. ఒక వైపు కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం పరిపాలన వైఫల్యాన్ని వేలెత్తి చూపుతున్నదన్నారు. మరో వైపు తరలిపోతున్న పెట్టుబడుల పర్వంతో యువత ఉపాధి అవకాశాలను దెబ్బ తీస్తున్నదన్నారు. కాంగ్రెస్ పవర్‌లోకి రాగానే గడియ గడియకు పవర్ కట్ ఏమిటని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ వేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు నోరు మెదపకపోవడం ఏమిటన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు, నిరుద్యోగులపై పోలీసులు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇదేనా కాంగ్రెస్ తెస్తానన్న మార్పు అని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో తీర్చిదిద్దేందుకు పదేండ్లు కష్టపడి పునాదులు వేస్తే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్నాడన్నారు. కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ మళ్లీ ఆగమయ్యే రోజులొస్తున్నాయని మండిపడ్డారు. పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఇకనైనా కాంగ్రెస్ సర్కార్ మేల్కొనకపోతే రాష్ట్రంతో పాటు దేశానికి కూడా నష్టమేనన్నారు. బీఆర్‌ఎస్ నిరుద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**తాండూరులో అక్రమాల జోరు..**

**అభివృద్ధి శూన్యం**

పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో తాండూరు నియోజకవర్గంలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలను ప్రజలకు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాండూరులో అక్రమాల జోరు నడుస్తున్నదన్నారు. దళారులు రాజ్యమేలడంతో ఎంతో మంది సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అక్రమంగా ఇసుక, సుద్ద, ఎర్రమట్టి, నాపరాతి తరలిస్తున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యే సన్నిహితులు అక్రమ వ్యాపారాలు జోరుగా చేస్తున్నారని విమర్శించారు. చిన్నపాటి వర్షానికే తాండూరు పట్టణంలోని కొన్ని కాలనీలు నీట మునుగుతున్నప్పటికీ చిలుక వాగుపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించడం లేదన్నారు. చిలుక వాగు నాలా విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. గతంలో తాము తీసుకొచ్చిన అభివృద్ధి పనులను అడ్డుకుంటే ప్రజా ఉద్యమం చేస్తామన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన కట్టడాలకు శంకుస్థాపనలు చేసి సంతోష పడుతున్నారని, కొత్త నిధులేమీ లేవన్నారు. అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేయకుండా వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తాండూరు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. పార్టీ నేతలతో పాటు తాండూరు ప్రజలనూ ఇబ్బందులకు గురి చేస్తే రాబోవు రోజుల్లో సరైన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం 5 సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించి.. పదవీ బాధ్యతలు ముగిసిన ప్రజాప్రతినిధులను మాజీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. వచ్చే ఎన్నికల్లో ఊరూరా బీఆర్‌ఎస్ జెండా ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు శ్రీశైల్‌రెడ్డి, రాజుగౌడ్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌చారి, రవీందర్‌రెడ్డి, నయీం, వీరేందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువ ఇంజినీర్లు దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి




పట్టాలు పొందిన విద్యార్థులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్, జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు

- ప్రపంచ దేశాల్లో భారతదేశంలో 65 శాతం యువత
- ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో భారతదేశానికి 5వ స్థానం
- తల్లిదండ్రులు కన్న కలలను విద్యార్థులు సాకారం చేయాలి
- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

మొయినాబాద్, జూలై 12 : యువ ఇంజినీర్లు దేశ ప్రగతి, దేశ ఆర్థిక స్థితిని మెరుగుపర్చి మొదటి స్థానంలో నిలువడానికి భాగస్వాములు కావాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో ఉన్న జేబీఐఈటీ కళాశాలలో 13వ పట్టభద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయడంతో పాటు ఆయా బ్రాంచ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబర్చి టాపర్లుగా నిలిచిన వారికి బంగారు పతకాలను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం జేబీఐఈటీ బీవోజీ చైర్మన్ కొలలూరి ఇనాక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పట్టభద్రుల పట్టాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్ పాల్గొని మాట్లాడారు. దేశంలో మొట్టమొదటి ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, దేశంలో అనేక నిర్మాణాలకు, సాగు నీటి ప్రాజెక్టుల డిజైన్లకు రూపకల్పన చేసిన వ్యక్తి అని అన్నారు. విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడంతో తనకున్న అపారమైన సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి విద్యుత్ ఉత్పత్తికి కృషి చేసిన ఇంజినీర్ అని చెప్పారు. నేటి తరం యువ ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని దేశ ప్రగతిలో యువ ఇంజినీర్‌లు కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలకెల్ల భారత దేశంలో యువత 65 శాతం ఉన్నదని చెప్పారు. ప్రపంచంలో ఏ దేశం కూడా భారత దేశ యువతతో పోటీ పడలేరని, భారత దేశంలో చదువుకున్న యువత విదేశాలకు వెళ్లి అక్కడ తమకున్న నైపుణ్యంతో ఆయా దేశాల ప్రగతిలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల్లో ఆర్థిక వ్యవస్థలో భారతదేశం 5వ స్థానంలో నిలిచిందని, కానీ భారత దేశంలో చదువుకున్న యువత తమ సేవలను దేశానికి ఉపయోగిస్తే ఆర్థికంగా ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా వృద్ధి చెందడానికి అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు పెట్టుకున్న కలలను సాకారం చేయడానికి కృషి చేయాలన్నారు. జేబీఐఈటీలో అపారమైన సాంకేతిక నైపుణ్యం ఉన్న అధ్యాపకుల చేత విద్యాబోధన చేస్తున్నారని, అందుకే విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. ఈ సందర్భంగా జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు మాట్లాడుతూ జేబీ విద్యా సంస్థల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించాలనే ఆలోచనతో మంచి సాంకేతిక నైపుణ్యం ఉన్న అధ్యాపకులను నియమించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన ల్యాబ్‌లు, మంచి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులకు మంచి వాతావరణం ఏర్పడే విధంగా పచ్చదనాన్ని పెంపొందించామని అన్నారు. జేబీ విద్యా సంస్థలో చదివిన వారు ప్రపంచంలోని అన్ని దేశాల్లో స్థిరపడి ఉన్నతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేబీ విద్యా సంస్థల కార్యదర్శి జేవీ కృష్ణారావు, టాలెంట్ ఎక్విజేషన్ లీడర్ మధన్మోహన్, జేబీ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ సంజయ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే ప్రధాన పాత్ర

**ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**



షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్లు

షాద్‌నగర్, జూలై12 : మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే ప్రధాన పాత్ర ఉంటుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ నరేందర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసుకోవాలని, ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులను మెరుగుపర్చాలని కోరారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వ నిధుల వెచ్చింపు, అభివృద్ధి పనులు, టెండర్లు, ఇతర కార్యాలయ నిర్వహణ పనుల వంటి అంశాలపై కౌన్సిలర్లకు పట్టుండాలని, ప్రతి పైస ఖర్చుపై అవగాహన ఉండాలని సూచించారు. అభివృద్ధి పనుల విషయంలో రూ. 10 లక్షల నిధులను వినియోగించుకునేందుకు మున్సిపల్ పాలక మండలికి అవకాశం ఇచ్చే విధంగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఇందులో భాగంగానే షాద్‌నగర్ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో వనమహోత్సంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కౌన్సిలర్లు వెంకట్రాంరెడ్డి, బచ్చలి నర్సింహ్మా, ప్రతాప్‌రెడ్డి, చెట్ల పావని, మహేశ్వరి, ప్రేమలత, నడికూడ సరిత, శ్రీనివాస్‌గౌడ్, జీటీ శ్రీనివాస్, ఈశ్వర్‌రాజు, అగ్గనూరు విశాల, కృష్ణవేణి, కానుగు అంతయ్య, నాయకులు పిల్లి శేఖర్, యాదగిరి, జూపల్లి శంకర్, చెట్ల నర్సింహ్మా, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన ఐజీ



తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ శుక్రవారం ధారూరులో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

- ధారూరు, జూలై 12

# ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీపీ



వికారాబాద్ ఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం ఐజీపీ వీ సత్యనారాయణ సందర్శించారు. ఎస్పీ నారాయణరెడ్డి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఏఆర్ పోలీస్ అధికారులతో ఐజీపీకి గౌరవ వందనం చేశారు. అనంతరం ఐజీపీ జిల్లాకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. వారితో పాటు డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు ఉన్నారు.

- వికారాబాద్, జూలై 12

# ఘనంగా పూరీ జగన్నాథ్ రథ యాత్ర

- దారి పొడవునా హారతులతో ఘన స్వాగతం పలికిన మహిళలు
- చూపరులను ఆకట్టుకున్న మహిళల కోలాటాలు, నృత్యాలు
- ప్రత్యేక ఆకర్షణగా విదేశీ వనితలు

ఆమనగల్లు, జూన్ 12 : ఆమనగల్లు పట్టణంలోని అయప్ప కొండ నుంచి శుక్రవారం పూరీ జగన్నాథ్ రథయాత్ర ప్రారంభమైంది. ఈ రథయాత్రను పురప్రముఖులు హాజరై ప్రారంభించారు. పట్టణంలోని హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి గుండా కోలాటాలు, సాంస్కృతిక నృత్యాల మధ్య పట్టణంలోని కన్యాకాపరమేశ్వరీ దేవాలయం వరకు రథయాత్ర కొనసాగింది ఆనంతరం దేవాలయంలో పూజలు, ప్రవచనాలు, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ రథ యాత్రకు పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు, యువకులు, మహిళలు తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. రథయాత్ర వెంబడి విదేశీ వనితలు సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తూ చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా రథయాత్ర వ్యవస్థాప్రముఖ్ పాపిశెట్టి రాము మాట్లాడుతూ కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ వారి సౌజన్యంతో ఈ రథయాత్ర ఆమనగల్లు పట్టణానికి చేరుకున్నదని తెలిపారు. రథయాత్రకు సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐ వెంకటేశ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ అనురాధ, రథయాత్ర కన్వీనర్ తల్లోజు వెంకటయ్య, బీఆర్‌ఎస్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు నేనావత్ పత్యానాయక్, మాండన్ శ్రీకాంత్‌సింగ్, పట్టణ ప్రముఖులు చెక్కల లక్ష్మణ్, రామ్మోహన్, ఎంగలి బాలకిష్టయ్య, అప్పం శ్రీను, అప్పం భద్రయ్య, రమేశ్, మోహన్‌రెడ్డి, కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.





జగన్నాథ్ రథయాత్రలో నృత్యాలు చేస్తున్న విదేశీ వనితలు, కోలాటం ఆడుతున్న మహిళలు